నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I హైదరాబాద్, మంగళవారం 19 నవంబర్ 2024 | YADADRI BHUVANAGIRI


## ముగిసిన గ్రూప్-3 పరీక్ష

- రెండో రోజు సజావుగా పేపర్-3 ఎగ్జామ్
- 50.85 శాతం మంది హాజరు



భువనగిరిలో సెంటర్ వద్ద నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 18 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18న నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు సజావుగా ముగిశాయి. పేపర్-3 పరీక్ష సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు జరిగింది. జిల్లాలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 6,043మంది అభ్యర్థులకు గానూ 3,093 (50.85)మంది హాజరుకాగా 2,970మంది గైర్హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను అధికారులు, పోలీసులు పరిశీలించారు. రెండు రోజులుగా జరిగిన పరీక్షల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని, ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా పరీక్షలు జరిగాయని అధికారులు తెలిపారు.

# మనియండ్ల గుట్టపై మైనింగ్ పడగ

## సర్కార్ భూముల లీజుకు ఓ కంపెనీ స్కెచ్

- కొండపై విలువైన రంగు రాళ్లపై కన్ను
- ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు ప్లాన్
- మైనింగ్‌తో భవిష్యత్‌లో నాలుగు గ్రామాలపై ప్రభావం
- శబ్దాలు, దుమ్ముతో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు
- పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం
- ఆవాసాలను కోల్పోనున్న పక్షులు, జంతు జాతులు
- నేల మట్టం కానున్న భారీ వృక్ష సంపద
- చుట్టు పక్కల పంట పొలాలపై ఎఫెక్ట్
- గొల్ల కుర్మల జీవనోపాధిపైనా దెబ్బ
- మైనింగ్‌ను తీవ్రంగా వ్యతిరేస్తున్న స్థానికులు

**ప్రకృతి సోయగంతో నిండిన ఓ కొండ.. విలువైన రంగు రంగుల పలుగు రాళ్లు గుట్ట సొంతం.. చుట్టూ పచ్చని పొలాలు.. కనువిందు చేసేలా అందాలు.. స్వచ్ఛమైన ప్రశాంత వాతావరణం.. నెమళ్లు, పక్షుల కిలకిలరావాలు.. ఎన్నో జీవరాశులకు అన్నం పెట్టే గిన్నె.. ఇదీ వలిగొండ మండలంలోని మనియండ్ల గుట్ట సంక్షిప్త స్వరూపం. ఇంత మంచి సంపదపై ఇప్పుడు మైనింగ్ మాఫియా కన్ను పడింది. ధనార్జనే లక్ష్యంగా ఏండ్ల చరిత్ర కలిగిన గుట్ట గుండెపై ఆధునిక యంత్రాలతో చిల్లులు పెట్టే కుట్రలు చేస్తున్నది. స్వార్థం కోసం కొండను తొలిచి ఆదాయ వనరుగా మార్చేందుకు పన్నాగాలు పన్నుతున్నది.**

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ)



వలిగొండ మండలం రేడ్ల రేపాకలోని మనియండ్ల గుట్ట

వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామంలో మనియండ్ల గుట్ట ఉంది. దీనికి ఎంతో చరిత్ర ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇది సర్వే నంబర్ 580లో సుమారు 140 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో 36 ఎకరాల ప్రభుత్వ భూమిని భార్గవ్ మినరల్స్ కంపెనీ లీజుకు తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. ఏటా 96వేల టన్నుల సామర్థ్యంతో క్వార్జ్ ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

### గుట్టపై విలువైన రంగురాళ్లు..

మనిగయండ్ల గుట్ట పైన విలువైన మైనింగ్ రాళ్లు ఉన్నాయి. రంగు రంగుల పలుగు రాళ్లు కనిపిస్తాయి. ఇప్పుడు దీనిపై సదరు కంపెనీ దృష్టి పడింది. పలుగురాళ్లు ఎక్కువగా ఉన్నందున వాటి వల్ల గ్లాస్ తయారీ కోసం ముడి సరుకుగా ఉపయోగపడుతుంది. అక్కడి విలువైన రాళ్లను రకరకాలుగా శుభ్రపరచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉంది. అదే విధంగా టైల్స్ తయారీకి కూడా ఉపయోగపడుతుందని గ్రామస్తులు అంటున్నారు. ప్రభుత్వానికి అరకొరగా పన్నులు చెల్లించి.. సర్కార్ సొమ్మును కొల్లగొట్టి లాభాలు పొందడమే కంపెనీ లక్ష్యంగా కనిపిస్తున్నది. ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వత్తాసు పలుకుతుండటంతో మైనింగ్ వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోయింది.

### నాలుగు గ్రామాలపై ప్రభావం..!

మనియండ్ల గుట్ట రెడ్ల రేపాక గ్రామంలో ఉన్నప్పటికీ సుమారు ఐదు గ్రామాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. మనియండ్ల గుట్ట చుట్టూ రెడ్ల రేపాక, అక్కంపల్లి, దాసిరెడ్డి గూడెం, మందాపురం గ్రామాలు ఉన్నాయి. గుట్టను 40మీటర్ల లోతుకు తవ్వడానికి కంపెనీ ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలుస్తున్నది. దీంతో ఆధునిక యంత్రాలతో పెద్దఎత్తున తవ్వకాలు చేపడతారు. ఇది అనేక అనర్థాలకు దారితీస్తుంది. ఒక వేల రాళ్లు పగలగొట్టడానికి పేలుళ్లు చేపడితే.. దాని ధాటికి ఇండ్లు బీటలువారే ఛాన్స్ ఉంటుంది. పెద్ద పెద్ద శబ్దాలు వస్తాయి. మైనింగ్‌తో ఇండ్లలోకి దుమ్ము చేరి సామగ్రి, ఇతర వస్తువులు చెడిపోతాయి. మైనింగ్ , లారీల రాకపోకలతో దుమ్ము చేలరేగుతుంది. రోడ్లు అస్తవ్యస్తంగా మారుతాయి. భారీ వాహనాలతో రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉంది. రోజుకు రోజుకు వాయుకాలుష్యంతో పాటు జల కాలుష్యం పెరిగి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంటుంది.



మనియండ్ల గుట్టపై ఉన్న రంగురాళ్లు

### తీవ్రంగా వ్యతిరేస్తున్న ప్రజలు..

ప్రజలు, పర్యావరణానికి నష్టం చేకూర్చే మైనింగ్ చర్యలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెల 21న పీసీబీ అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను తీవ్రంగా వ్యతిరేకించి అడ్డుకున్నారు. గ్రామంతో సంబంధం లేని వ్యక్తులతో అభిప్రాయాలు చెప్పించే ప్రయత్నం చేశారని, తాము అభ్యంతరం చెప్పి అడ్డుకోగానే అధికారులు అర్ధంతరంగా వెళ్లిపోయారని స్థానికులు చెప్పుకొస్తున్నారు. అనుమతులు ఇవ్వొద్దని ప్రజాప్రతినిధులు, అధికారులను కలుస్తూ తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మైనింగ్‌ను అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లే ఇలాంటి వ్యాపారాన్ని అరికట్టి.. ప్రకృతిని పరిరక్షించాలని స్థానిక ప్రజలు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

### నాలుగు గ్రామాలపై ప్రభావం..!

మనియండ్ల గుట్ట రెడ్ల రేపాక గ్రామంలో ఉన్నప్పటికీ సుమారు ఐదు గ్రామాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. మనియండ్ల గుట్ట చుట్టూ రెడ్ల రేపాక, అక్కంపల్లి, దాసిరెడ్డి గూడెం, మందాపురం గ్రామాలు ఉన్నాయి. గుట్టను 40మీటర్ల లోతుకు తవ్వడానికి కంపెనీ ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలుస్తున్నది. దీంతో ఆధునిక యంత్రాలతో పెద్దఎత్తున తవ్వకాలు చేపడతారు. ఇది అనేక అనర్థాలకు దారితీస్తుంది. ఒక వేల రాళ్లు పగలగొట్టడానికి పేలుళ్లు చేపడితే.. దాని ధాటికి ఇండ్లు బీటలువారే ఛాన్స్ ఉంటుంది. పెద్ద పెద్ద శబ్దాలు వస్తాయి. మైనింగ్‌తో ఇండ్లలోకి దుమ్ము చేరి సామగ్రి, ఇతర వస్తువులు చెడిపోతాయి. మైనింగ్ , లారీల రాకపోకలతో దుమ్ము చేలరేగుతుంది. రోడ్లు అస్తవ్యస్తంగా మారుతాయి. భారీ వాహనాలతో రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉంది. రోజుకు రోజుకు వాయుకాలుష్యంతో పాటు జల కాలుష్యం పెరిగి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంటుంది.

### పర్యావరణానికి పెను ముప్పు



జిల్లాలో ఇప్పటికే మైనింగ్ కంపెనీలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి. మూసీతో జిల్లాలోని పలు మండలాలు మురికి కూపంగా మారి.. దుర్గంధాన్ని వెదల్లుతున్నాయి. మనియండ్ల గుట్ట మైనింగ్ వ్యాపారులకు అప్పగిస్తే.. అనతి కాలంలోనే కాలగర్భంలో కలిసిపోయే అవకాశం ఉంది. ఏండ్లుగా ఉన్న ప్రకృతి సంపద కనుమరుగవుతుంది. దీంతో పర్యావణానికే పెను ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఆయా చుట్టు పక్కల గ్రామాల పరిసరాల్లో పచ్చదనం కంటికి కనిపించదు. గుట్టపై ఉన్న ఖనిజ సంపద కరిగిపోతుంది. దుమ్ము, ధూళితో చుట్టూ ఉన్న పచ్చని పొలాలపై ప్రభావం పడుతుంది. మూగజీవాలు ఆవాసాలను కోల్పోతాయి. ఇక్కడ సంచరిస్తున్న నెమళ్లు, అడవి పందులు, కోతులు జనావాసాల్లోకి వచ్చి ప్రాణాలు కోల్పోయే ముప్పు ఉంది. వృక్ష సంపద నేల మట్టం అవుతుంది. ప్రస్తుతం నాలుగు గ్రామాల రైతులు నిత్యం గుట్టపైకి తీసుకెళ్లి గొర్రెలు, పశువులు, మేకలను మేపుతున్నారు. గుట్ట.. మైనింగ్ వ్యాపారుల చేతుల్లోకి వెళితే పశువుల గ్రాసానికి కష్టాలు తప్పవు. కుర్మ గొల్లల ఉపాధిపైనా దెబ్బ పడుతుంది. వర్షాలు కురిసినప్పుడు దానిపై నుంచి వచ్చే వాన నీరు దగ్గరలో ఉన్న చెరువుల్లోకి చేరి నిండుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

### మనియండ్లగుట్ట సబ్బండ వర్గాల సంపద



మనియండ్లగుట్ట అంటేనే రెడ్లరేపాక గ్రామంలోని సబ్బండ వర్గాలకు ప్రకృతి ప్రసాదించిన సంపద. గుట్టపై ఆధారపడి రెడ్లరేపాక గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లు, పాడినే జీవనాధారంగా పశువులను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ గుట్టను పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం లీజుకు ఇవ్వాలనే ఆలోచన విరమించుకోవాలి. ప్రజలకు అన్యాయం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదు. ప్రాణాలను ఫణంగా పెట్టి గుట్టను కాపాడుకుంటాం.

**-నోముల మల్లేశం, రైతు, రెడ్లరేపాక, వలిగొండ మండలం**

### జీవ వైవిధ్యాన్ని నాశనం చేసే చర్యలను ప్రభుత్వం మానుకోవాలి



జీవ వైవిధ్యాన్ని, ప్రకృతి ప్రసాదించిన వనరులను నాశనం చేసే చర్యలను ప్రభుత్వం మానుకోవాలి. మనియండ్ల గుట్టను ఆవాసంగా చేసుకొని రకరకాల వన్య మృగాలు, పక్షి జాతులు జీవిస్తున్నాయి. అనేక రోగాలను నయంచేసే అత్యంత అరుదైన అమూల్యమైన ఆయుర్వేద వనమూలికలు ఇందులో ఉన్నాయి. గుట్టను లీజు పేరుతో ధ్వంసం చేసే చర్యలను ప్రభుత్వం మానుకోవాలి. మనియండ్లగుట్టను తవ్వితో జీవావరణ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుంది. ఇదంతా ఎవరి లాభం కోసం. ప్రజల మనోభీష్టాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం మైనింగ్ లీజుకు ఇస్తే తిరుగుబాటు తప్పదు.

**-గుర్రం లక్ష్మారెడ్డి, రైతు, రెడ్ల రేపాక, వలిగొండ మండలం**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

## ఏం సాధించారని విజయోత్సవాలు

- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం
- హామీల అమలులో సర్కారు విఫలం
- తులం బంగారం, పింఛన్ల పెంపు ఊసే లేదు
- మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

కొండమల్లేపల్లి, నవంబర్ 18 : రేవంత్ సర్కార్ 11 నెలల పాలనలో ఏమి సాధించి పెట్టారో, ఏ హామీలు అమలు చేశారో ప్రజలకు వివరించి విజయోత్సవాలు జరుకోవాలని మాజీ ఎంపీ, సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బడుగు లింగయ్య యాదవ్ అన్నారు. కొండమల్లేపల్లిలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అలవిగాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందన్నారు. పథకాల విషయంలో రైతులకు ఇచ్చిన మాట కూడా తప్పిందని తెలిపారు. ఎన్నికల ముందు కల్యాణలక్ష్మితోపాటు పెండ్లి కానుకగా తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పుడు లక్షల రూపాయల కాదుకదా తులం బంగారం ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ప్రతి మహిళకు రూ.2,500 చొప్పున పింఛన్, వృద్ధులు, వితంతవులు, బీడీ కార్మికులకు పింఛన్లు పెంచుతామని మోసం చేసిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పేరిట రూ.10 వేలు ఇస్తే దాని పేరు రైతుభరోసాగా మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తామని చెప్పి 11 నెలల గడిచినా అతీగతిలేదని మండిపడ్డారు. రైతుబంధు ఇవ్వకుండా రైతుల నోట్లో మట్టి కొట్టారన్నారు. 30 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ జరుగలేదని ఆరోపించారు. పత్తి, ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధర కల్పించడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పాలన గాడి తప్పిందని, వ్యాపారులు, రైతులు, రియల్టర్లు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం రూ.90 వేల కోట్ల అప్పులు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని చెప్పారు. ఎటు చూసిన ధర్నాలు, రాస్తోరోకోలు చేస్తున్నారని, ప్రభుత్వం ఎవరినీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. 11 నెలల్లో గురుకులాల్లో కలుషిత ఆహారరం, వివిధ కారణాలతో 36 మంది విద్యార్థులు చనిపోయినా పట్టించుకునే నాథుడే లేదని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రమంతా గులాబీ జెండా ఎగరడం ఖాయమని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుండబోయిన లింగం యాదవ్, పెద్దిశెట్టి సత్యానారాయణ, బోడ గిరి, వెంకటయ్య పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

## రూ.130 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశాం

- కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 18 : జిల్లా వ్యాప్తంగా ఒక లక్ష పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.130 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. భూదాన్‌పోచంపల్లిలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలని, మిల్లర్లు వచ్చిన ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని, రైతులకు ట్రక్ తొందరగా ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం మిల్లులకు తరలించిన 48 గంటల్లో రైతులకు డబ్బులు వేస్తారని అన్నారు. జిల్లాలో టాబ్ ఎంట్రీ పేమెంట్ గ్యాప్ లేకుండా ఉన్నత స్థాయి అధికారులు, క్షేత్ర స్థాయిలో టెలికాన్ఫరెన్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందని, పది రోజుల్లో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. టార్పాలిన్, ట్రాన్స్‌పోర్ట్ కొరత లేదని తెలిపారు. జిల్లాలో 60 శాతం కుటుంబ సర్వే జరిగిందని, ఇంటింటి సర్వే శరవేగంగా జరుగుతున్నదని అన్నారు. జిల్లాలో పారామెడికల్ కాలేజీలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని, నర్సింగ్, ఎక్స్‌రే కోర్సులకు మంచి డిమాండ్ ఉన్నదని, రేపటితో చివరి గడువు అని, ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్, ఎంపీఓ మజీద్, ఎంఆర్ఐ గుతా వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ బాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం)లో పత్తి మిల్లు వద్ద బారులు దీరిన ట్రాక్టర్లు

## పత్తిని అమ్ముకునేందుకు రైతులకు తప్పని నిరీక్షణ

ఆత్మకూరు(ఎం), నవంబర్18 : మండల కేంద్రంలోని సిద్దేశ్వర పత్తి మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో పత్తిని అమ్ముకునేందుకు రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. వివిధ మండలాల నుంచి సోమవారం రైతులు ట్రాక్టర్ల ద్వారా పత్తిని తీసుకొని భారీగా తరలిరావడంతో కిలోమీటర్ వరకు పత్తి ట్రాక్టర్లు నిలిచిపోయాయి. ఈ నెల 4న ప్రారంభించిన సీసీఐ కేంద్రంలో ఇప్పటి వరకు 514 మంది రైతుల నుంచి 15,800 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రైవేట్‌గా సిద్దేశ్వర పత్తిమిల్లు ఇప్పటివరకు 40వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది.

# బీసీలకు ఆర్థిక పరిపుష్టి కల్పించాలి

- కార్పొరేషన్‌తో సబ్సిడీ రుణాలు, వెల్ఫేర్‌తో విద్యాభివృద్ధి చేయాలి
- రాష్ట్రంలో 54శాతం ఉన్న బీసీలపై పాలకులు కరుణ చూపడం లేదు
- వెనుకబడిన, సంచార జాతులను బీసీ ఏ నుంచి ఎస్సీలో చేర్చాలి
- దామాషా ప్రకారం విద్య, ఉద్యోగం, చట్ట సభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలి
- బీసీ కమిషన్ ముందు పలు బీసీ సంఘాలు, నేతల విన్నపాలు, సూచనలు
- ప్రభుత్వానికి నివేదించి అమలు దిశగా చర్యలు తీసుకుంటామన్న చైర్మన్ నిరంజన్




సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, చిత్రంలో నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హన్మంతరావు, తేజస్ నందలాల్ పవార్ తదితరులు

నల్లగొండ, నవంబర్ 18 : రాష్ట్రంలో 54శాతానికి పైగా ఉన్న బీసీల పట్ల పాలకులు కరుణ చూపడం లేదని, ఫలితంగా అన్ని రంగాల్లో వెనుకబడ్డ బీసీలకు ఆర్థిక పరిపుష్టి కల్పించాలని పలు బీసీ సంఘాల నేతలు, ప్రతినిధులు బీసీ కమిషన్ ముందు విన్నవించారు. రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులను పరిశోధించడానికి ఉమ్మడి జిల్లా పరిధిలోని బీసీ సంఘాల ప్రతినిధులతో సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అధ్యక్షతన బహిరంగ విచారణ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి బీసీ కులాలకు సంబంధించిన వారు బీసీ ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, విద్య, ఉద్యోగాలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు, కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం, వెల్ఫేర్ ద్వారా అరకొర వసతులపై రాతపూర్వకంగా ఇవ్వడంతో పాటు కమిషన్ ముందు తమ అభిప్రాయాలు వెల్లడించారు.

**బీసీలపై చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన..**

రాష్ట్ర జనాబాలో బీసీలే సింహ భాగం ఉన్నప్పటికీ ఆది నుంచి పాలకులు చిన్నచూపు చూస్తున్నారని పలువురు నేతలు కమిషన్ ముందు వాపోయారు. ప్రధానంగా బీసీల్లో ఆర్థిక పరిపుష్టిలేక వెనుకబడి పోతున్నారని..ఈ విషయంలో ప్రభుత్వాలు కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు రావడం లేదని, వెల్ఫేర్ ద్వారా కావాల్సిన సాయం లేదని కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. బీసీల్లో వెనుకబడిన, తక్కువ సంఖ్యలో ఉన్న వాటి కులాల గుర్తింపు అనేదే లేదని, సంచార జాతుల గురించి పట్టించుకునే వారే లేరని, అలాంటి వారికి ప్రభుత్వాలు అండగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంచార జాతులు వేరే రాష్ట్రాల్లో ఎస్సీలుగా ఉంటే ఇక్కడ మాత్రం బీసీ ఏలో చేర్చారని.. అలాంటి వారిని ఎస్సీ కులంలో చేర్చాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన కొన్ని కులాలను బీసీ బీ, బీసీ డీలో కాకుండా బీసీ ఏలో చేర్చాలని మరికొన్ని కులాలు కమిషన్‌ను కోరాయి. బీసీలందరికీ జనాభా ప్రకారం విద్య, ఉద్యోగం, చట్ట సభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని ముక్తకంఠంగా అన్ని సంఘాలు కమిషన్ దృష్టికి తీసుకొచ్చాయి.

**ప్రతి ఒక్కరి ఆవేదన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం: బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్**

బీసీల జీవన విధానం, ఆర్థిక పరిపుష్టి, విద్యా విధానం, ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుపై ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బీసీలు తమ అభిప్రాయాలు తెలియచేయడంతోపాటు సాదకబాధకాలు చెప్పారని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. ప్రతి వ్యక్తి అభిప్రాయాన్ని, ఆవేదనను రాత పూర్వకంగా తీసుకోవడంతో పాటు విన్నామని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

బీసీలపై అనవసరంగా అట్రాసిటీ కేసులు పెట్టిస్తే బీసీ కమిషన్ ఉపేక్షించబోదని, అలాంటి విషయాలు ఉంటే కమిషన్ దృష్టికి తీసుకొని రావాలని చెప్పారు. ప్రధానంగా కొన్ని సంచార, వెనుకబడిన జాతుల వారు బీసీ ఏ నుంచి ఎస్సీ కులంలోకి మార్చాలని విన్నవించారని అన్నారు. బీసీలు ఇప్పటికి కొన్ని ప్రాంతాల్లో వివక్షకు గురవుతున్నారని, కుల వృత్తుల వారు ఇబ్బంది పడుతున్న విషయం తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కుల సర్వే జరుగుతున్నందున ఈ సర్వేలో బీసీలు అందరూ తప్పనిసరిగా పాల్గొని వివరాలు చెప్పాలన్నారు. ఈ సర్వే వల్ల బీసీల జనాభా ఎంతో తెలుస్తుందని..ఈ సర్వే తర్వాత జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కూడా అమలయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 65 నుంచి 70శాతం సర్వే పూర్తి కావడం శుభపరిణామమని, త్వరలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు, ఎన్యుమరేటర్లను కోరారు. ఈ బహిరంగ విచారణలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హన్మంతరావు, తేజస్ నందలాల్ పవార్, నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్, అధికారులు అలీ, అనసూయ, యాదయ్య పాల్గొన్నారు.